# సాక్షి చిత్తూరు

సోమవారం । 9 । డిసెంబర్ । 2024






**వీధి వీధికో బార్**

జిల్లాలోని మద్యం షాపుల వారు పర్మిట్ రూములు ఏర్పాటుచేసుకున్నారు. అవి బార్లను తలపిస్తున్నాయి.

- 8లో



**'బాడీ బిల్డింగ్'లో స్వర్ణ పతకం**

బాడీ బిల్డింగ్ పోటీల్లో శాంతిపురం మండలానికి చెందిన యువకుడు స్వర్ణ పతకం సాధించాడు.

- 8లో



**ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి**

అంగన్‌వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘం నాయకురాలు వేమేశ్వరి డిమాండ్ చేశారు.

- 8లో

## న్యూస్‌రీల్

### భక్తులతో కిటకిటలాడిన కాణిపాకం



క్యూలలో ఉన్న భక్తులు

కాణిపాకం: కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయ ఆవరణం జనంతో నిండిపోయింది. క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఉచిత దర్శనంతో పాటు శీఘ్ర, అతి శీఘ్ర దర్శనం లైన్లన్నీ నిండాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు.

### ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఏడీ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 14 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 2,897 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, 2,797 మంది పరీక్షలకు హాజరయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టామన్నారు. చిత్తూరు నగరంలోని 4 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి పరీక్షల తీరును పర్యవేక్షించినట్లు వెల్లడించారు.

### సైనికుల సంక్షేమానికి కృషి

- జిల్లా సైనిక సంక్షేమ అధికారి రాఘవులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సైనిక సంక్షేమాధికారి రాఘవులు

గంగవరం: జిల్లాలో ప్రస్తుత సైనికులు, మాజీ సైనికుల కుటుంబ సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తామని జిల్లా సైనిక సంక్షేమ శాఖాధికారి రాఘవులు అన్నారు. గంగవరం సమీపంలోని మాజీ సైనికుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత మాజీ సైనికులు పలు సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా గుర్తింపు కార్డుల జారీ, హౌస్ ట్యాక్స్ మినహాయింపు, కార్యాలయ భవనానికి స్థలం కేటాయింపు, లిక్కర్‌పై ట్యాక్స్ తగ్గింపు, మాజీ సైనికులకు భూమి కేటాయింపు తదితర సమస్యలను నివేదించారు. దీనిపై జిల్లా సైనిక సంక్షేమాధికారి స్పందించారు. సభ్యులు తన దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం సైనిక సంక్షేమ నిధి కోసం విరాళాల సేకరణ కరపత్రాలు ఆవిష్కరించారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు పయని, కార్యదర్శి గిరిధర్, ఏపీ ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు ఆనంద బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్, వెల్ఫేర్ ఆర్గనైజర్ వినాయకరెడ్డి, పలువురు మాజీ సైనికులు పాల్గొన్నారు.



దోమలు వృద్ధి చెందకుండా మందు పిచికారీ చేయిస్తున్న పంచాయతీ అధికారులు (ఫైల్)

# బొమ్మసముద్రం మెరిసె.. ఆరోగ్యం విరిసె

కృషి, పట్టుదల, ప్రజల సహకారానికి పాలకుల ఆదర్శ భావజాలం తోడైతే ఉన్నత స్థానం చేరుకోవచ్చు. అవార్డులను సొంతం చేసుకోవచ్చని ఐరాల మండలం బొమ్మసముద్రం పంచాయతీ పాలకులు, అధికారులు నిరూపించారు. పంచాయతీని ఆరోగ్య పంచాయతీ(హెల్తీ పంచాయతీ) విభాగంలో జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిపి ఇతర పంచాయతీలకు ఆదర్శంగా నిలిచారు. ఈనెల 11వ తేదీన ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన బొమ్మసముద్రం
- దీన్ దయాల్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారానికి ఎంపిక
- 11న రాష్ట్రపతి నుంచి అందుకోనున్న అవార్డు, రూ.కోటి ప్రోత్సాహక నగదు
- ప్రత్యేక ప్రణాళిక, సమష్టి కృషే కారణం..
- సర్పంచ్, అధికారులు, గ్రామస్తుల ఆనందం

ఐరాల: మండలంలో బొమ్మసముద్రం పంచాయతీ జాతీయ స్థాయిలో దీన్ దయాల్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారానికి ఎంపిక కావడంతో గ్రామస్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. బొమ్మసముద్రం పంచాయతీ జాతీయ స్థాయిలో ఎంపిక కావడానికి చిగరపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం కీలక పాత్ర పోషించింది. పంచాయతీలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, వైద్య సేవలు, పారిశుద్ధ్య నిర్వహణ, ఆరోగ్య విషయాలపై ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు చేపట్టడంలో ఈ పంచాయతీ ముందుంది. మాతా శిశు మరణాలను నివారించడంలో ఆదర్శంగా నిలిచింది. సర్పంచ్, గ్రామస్తులతోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది సమిష్టి కృషితోనే జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిందని పంచాయతీ కార్యదర్శి మౌనిక తెలిపారు. ఈ నెల 11న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనుండడంపై హర్షం వ్యక్తం చేశారు.

**అంగన్‌వాడీ కేంద్రాల సహకారం**

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించడానికి, వారి ప్రత్యేకమైన ఆహార అవసరాలను తీర్చడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలకంగా పనిచేశాయి. తల్లి ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, చంటి బిడ్డలకు పాలివ్వడాన్ని ప్రోత్సహించడంతో పాటు పిల్లల్లో సరైన పెరుగుదల, అభివృద్ధికి తోడ్పడడంలో అంగన్‌వాడీ వర్కర్లు కీలక భూమిక పోషించారు. ముఖ్యంగా పిల్లల బరువు, ఎత్తు, ఆరోగ్య పరిస్థితిని క్రమం తప్పకుండా అంచనా వేశారు. పోషకాహారం, ఆరోగ్యకరమైన పద్ధతుల గురించి కుటుంబాలకు అవగాహన కల్పించారు. దీంతో మెరుగైన ఫలితాలు వచ్చాయి.

**అవగాహన కార్యక్రమాల నిర్వహణ**

పంచాయతీలో గర్భిణులు, బాలింతల ఆరోగ్యంతోపాటు పిల్లలకు పోషకాహారం ఇవ్వడంవల్ల కలిగే ప్రయోజనాలపై వైద్య సిబ్బంది, పంచాయతీ అధికారులు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వ్యాధులను నివారించడానికి సరైన నీటి నిల్వ, పరిశుభ్రత పద్ధతుల ప్రాముఖ్యతపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎస్సీ కాలనీల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగాన్ని ప్రోత్సహించడం, ఆరోగ్య ప్రయోజనాలను వివరించడం, పారిశుద్ధ్య సంస్కృతిని పెంపొందించడం లక్ష్యంగా కమ్యూనిటీ సమావేశాలు చేపట్టారు. ఈ సమష్టి ప్రయత్నాల ద్వారా ప్రజల్లో అవగాహనను పెంచగలిగారు. గ్రామ సభలు నిర్వహించి పోషకాహారం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు ద్వారా సమాజ ఆరోగ్యం, శ్రేమస్సును ప్రోత్సహించారు. గ్రామస్తులకు అవసరమైన పోషకాలు, ఆరోగ్యకరమైన ఆహార పద్ధతులు, స్థానికంగా లభించే ఆహారాల ప్రయోజనాల గురించి గ్రామ సభల్లో తెలియజేశారు.

**ఆరోగ్యంపై ప్రత్యేక కార్యాచరణ**



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మసముద్రం గ్రామ పంచాయతీలో అధికారిక నివేదికల ప్రకారం 459 కుటుంబాలు ఉన్నాయి. 1682 మంది జనాభా ఉన్నారు. ఇక్కడ వెల్‌నెస్ సెంటర్, హెల్త్ సెంటర్లు లేవు. చిగరపల్లె పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, పంచాయతీ అధికారుల సమన్వయంతో పంచాయతీలో ప్రతినెలా రోగాల నివారణకు పలు చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించడం తదితర చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తద్వారా ప్రజలు రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా జీవనం సాగిస్తున్నారు.

**ఆరోగ్య పంచాయతీగా ఎంపిక కావడంలో కీలక అంశాలు..**

వైద్య సిబ్బంది ప్రజలకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు అందించడంతో పాటు మొదటి త్రైమాసికంలో గర్భిణులను వంద శాతం నమోదు చేసుకోవడంలో లక్ష్యాన్ని సాధించారు. గర్భిణులను సకాలంలో గుర్తించి వారి పర్యవేక్షణకు ప్రాధాన్యత ఇవ్వడంలో సఫలం అయ్యారు. ప్రసవానంతరం తల్లీబిడ్డల సంరక్షణ, ఆరోగ్య విద్యకు ప్రాధాన్యమిచ్చారు. ఏబీహెచ్‌ఏ కార్డుల ద్వారా ఆరోగ్య సంరక్షణ సేవలను యాక్సెస్ చేయడానికి డిజిటల్ ఆరోగ్య గుర్తింపును అందించారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాల కింద ప్రయోజనాల వినియోగాన్ని సులభతరం చేస్తూ ఆశించిన ఫలితాలు రాబట్టారు. ఈ చొరవ ప్రసూతి ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచడంతో పాటు గర్భిణులకు సమగ్ర మద్దతు లభించడంతో పంచాయతీలో వందశాతం సంస్థాగత ప్రసవాలు చేపట్టారు. తద్వారా మాతా శిశు మరణాలను నివారించారు.





చలివేంద్రం ఏర్పాటు చేసిన సర్పంచ్ రఘు, వైద్య సిబ్బంది (ఫైల్)

**పథకాలను అందిపుచ్చుకుని..**

మాతా శిశు ఆరోగ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధానమంత్రి మాతృ వందన యోజన(పీఎంఎంవీవై) పథకంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గర్భిణుల ఆరోగ్యం, శిశు సంరక్షణ కోసం ఉద్దేశించిన కిల్కారి కార్యక్రమాన్ని అమలుచేశారు. క్రమం తప్పకుండా ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని చేపట్టి పిల్లలకు వ్యాక్సిన్లు వేశారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించారు.

**పచ్చదనం పెంపు కార్యక్రమాలు**

పంచాయతీలో సర్పంచుతోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంతో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు. తద్వారా పర్యావరణ సుస్థిరతలో నిబద్ధతను చాటుకున్నారు. పర్యావరణ అనుకూల కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొనేలా ప్రోత్సహించారు. పచ్చని భవిష్యత్తును రూపొందించడానికి చేపట్టిన సమష్టి కృషి సత్ఫలితాలు ఇచ్చాయి.



బొమ్మసముద్రంలో చెత్త సేకరిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

**కమ్యూనిటీ హెల్త్ కీలక విజయాలు**

- వ్యక్తిగత, సమాజ పరిశుభ్రతను సాధించడానికి కమ్యూనిటీ హెల్త్ విభాగం అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది.
- వ్యర్థాల నిర్వహణ, ఇంటింటా చెత్త సేకరణను అమలు చేయడం, మురుగు కాలవలను శుభ్రం చేయడం, ఫాగింగ్, స్ప్రెయింగ్‌తో సహా పారిశుద్ధ్య పనులను క్రమం తప్పకుండా చేపడుతున్నారు.
- నెలకొకసారి తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించడంతోపాటు క్లోరినేషన్ చేయిస్తున్నారు.
- కిచెన్ గార్డెన్స్, తల్లిపాలు, రుతుక్రమ ఆరోగ్య నిర్వహణ, వ్యక్తిగత గృహ మరుగుదొడ్ల వినియోగాన్ని ప్రోత్సహించడానికి ప్రణాళికను రూపొందించుకుని అమలుచేస్తున్నారు.
- ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి వినూత్న విధానాలను అవలంబించారు. ఇందులో లైవ్ హెల్త్ సెషన్లు, ప్రైవేటు సంస్థలతో కలిసి ఆరోగ్య ప్రచారాలు చేపట్టారు. టెలిమెడిసిన్ సేవలపై అవగాహన పెంచడం, ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వేలు చేయడంపై దృష్టి సారించారు.
- ఐదేళ్లలోపు పిల్లల మరణాలు సున్నా, ప్రసూతి మరణాలు సున్నా, వంద శాతం సంస్థాగత ప్రసవాలు, కిశోర బాలికల్లో రక్తహీనత సున్నా కేసులు నమోదయ్యేలా చేశారు.
- కాలానుగుణ వ్యాధులను సమర్థవంతంగా నియంత్రించారు.

**చాలా ఆనందంగా ఉంది**



బొమ్మసముద్రం గ్రామ పంచాయతీ జాతీయ స్థాయిలో అవార్డు దక్కించుకోవడం ఆనందంగా ఉంది. పంచాయతీ పాలకవర్గం అభివృద్ధిపై మొదటి నుంచి ప్రత్యేక దృష్టి సారించడం వల్లే ఇది సాధ్యమైంది. పారిశుద్ధ్యం మెరుగుపరచడానికి ప్రాధాన్యత ఇచ్చాం. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో వైద్య శాఖ కీలక పాత్ర పోషించింది. ప్రజలకు సేవ చేయాలనే తపన ఉంటే అవార్డులు వాటంతట అవే వస్తాయి.

– రఘు, సర్పంచ్, బొమ్మసముద్రం, ఐరాల

**ప్రజల ఆరోగ్యమే ధ్యేయం**



ప్రజారోగ్యమే ధ్యేయంగా పంచాయతీలో పారిశుద్ధ్య పనులు చేపట్టాం. ప్రతి రోజూ క్రమం తప్పకుండా మురుగు కాలవలను శుభ్రం చేయడం, ఇంటింటా చెత్త సేకరించడం, దోమల నివారణకు ఫాగింగ్ చేయడం తదితర కార్యక్రమాలు నిర్వహించాం. దీంతో వ్యాధులకు అడ్డుకట్ట వేయగలిగాం. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి నిలిపాం. బొమ్మసముద్రానికి జాతీయస్థాయి అవార్డు రావడం వెనుక పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది, మండల అధికారుల సమష్టి కృషి ఉంది.

– మౌనిక, పంచాయతీ కార్యదర్శి, బొమ్మసముద్రం, ఐరాల

# అధికారులతో ఢీఆర్సీ

- ఎమ్మెల్యేలంటే ఎందుకంత చిన్నచూపు
- జిల్లా అధికారులపై విరుచుకుపడిన కూటమి ఎమ్మెల్యేలు
- ప్రజా సమస్యలకంటే అధికారులపైనే టార్గెట్
- సభ్యుడు కాకున్నా జిల్లా స్థాయి సమీక్షలో చల్లా రామచంద్రారెడ్డి





సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష (డీఆర్‌సీ) అధికారుల టార్గెట్ సమావేశంగా మారింది. చిత్తూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. అజెండాలో 53 శాఖల అంశాలు ఉండగా 7 శాఖలపైనే చర్చించి మమా అనిపించారు.

**అధికారులే టార్గెట్**

జిల్లా ప్రజల సమస్యలు, అభివృద్ధి పనులు, ఇతర అంశాలను చర్చించాల్సిన కూటమి ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులను టార్గెట్‌గా చేయడమే పనిగా పెట్టుకున్నారు. వారిని కించపరుస్తూ మాట్లాడారు. ఇటీవల కుప్పం నియోజకవర్గంలోని అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీచర్లకు చేపట్టిన శిక్షణా తరగతుల్లో అతిథిగా తనను ఆహ్వానించలేదంటూ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డిపై మండిపడ్డారు. అదేవిధంగా చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్ మోహన్, మురళీమోహన్ సైతం జిల్లా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలంటే చిన్న చూపు చూస్తున్నారని, సిఫార్సు లెటర్లు ఇస్తే పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్యాలయాల్లో నాయకులకు విలువ ఇవ్వడం లేదన్నారు.

**నీళ్లు ఇవ్వండి చాలు**

ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ సమీక్షలో ప్రభుత్వ విప్, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ స్వర్ణాంధ్రప్రదేశ్ మాకొద్దు...నీళ్లు ఇవ్వండి చాలు అని అన్నారు. ఇటీవల పాలసముద్రం మండలంలోని ప్రజలు కలుషిత నీరు తాగి ఆస్పత్రుల పాలైనట్లు గుర్తుచేశారు.

**గొప్పలు కొండంత**

ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈ నెల 12వ తేదీతో ఆరు నెలలు పూర్తవుతుందన్నారు. కుప్పం, విజయపురం, పలమనేరు, చిత్తూరులో ఇండస్ట్రియల్ పార్కులు నిర్మించకపోయినా నిర్మించినట్లు చెప్పారు. జిల్లాలో ఉపాధి హామీ పథకంలో 2,776 పశువుల షెడ్లకు అనుమతులు ఇచ్చి 50 షెడ్లను పూర్తి చేశామని పేర్కొన్నారు. పంట సంజీవని, కాలువల పనులు ఎక్కడా చేపట్టకపోయినా చేపట్టినట్లు తెలిపారు. ఇసుక పాలసీ విజయవంతమని గొప్పలు చెప్పుకున్నారు.

**సభ్యుడుకాకున్నా సమావేశంలో..**

ఎలాంటి అర్హత లేకున్నా పుంగనూరు టీడీపీ నాయకుడు చల్లా రామచంద్రారెడ్డి జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. దీంతో పలువురు అధికారులు ఆశ్చర్యపోయారు. అధికారులు ఆయనకు ఎమ్మెల్యేలతో సమానంగా మర్యాదలు చేశారు. అలాగే పలువురు టీడీపీ నాయకులు సైతం సమావేశంలో పాల్గనడంపై విమర్శలు వెల్లువెత్తాయి.



ఎలాంటి అర్హత లేకున్నా సమీక్షలో పాల్గొన్న పుంగనూరు టీడీపీ నాయకుడు చల్లా రామచంద్రారెడ్డి

**సమీక్షలో చర్చించిన పలు అంశాలు..**

- ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్రీయ కృషి వికాస్ యోజనా నిధులను మూడు నెలల్లో ఎలా ఖర్చు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులను నిలదీశారు.
- జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో పట్టు సాగు ఎక్కువగా ఉందన్నారు. మార్కెటింగ్ సమస్యలు ఉన్నట్లు తెలిపారు. రీలింగ్ యూనిట్, షెడ్స్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో షెడ్స్ ఏర్పాటుకు రూ.6.5 లక్షలు ఇచ్చేవారని, ప్రస్తుతం రూ.3 లక్షలే ఇస్తున్నారని పేర్కొన్నారు.
- కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ మాట్లాడుతూ జిల్లాలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 20 వేల ఫిర్యాదులు అందాయన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 33 రోజుల పాటు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో ఇండో–ఇజ్రాయేల్ అనుబంధంగా రూ.10 కోట్లతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అపార్ కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.
- చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ మాట్లాడుతూ ప్రతి శాఖలో అమలయ్యే కార్యక్రమాల వివరాలను ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు.
- పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ జిల్లాలో నల్ల బెల్లంపై ఆంక్షలు విధించడంతో రైతులు చెరుకు సాగును మానేశారన్నారు. చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్‌వో మురళీ మోహన్, కడా పీడీ వికాస్ మర్మత్, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఎఫ్‌వో భరణి పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు. ఇందులో అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని ఆదేశించారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**పోలీసు కార్యాలయంలో..**

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్ముడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చని తెలిపారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడతామని ఎస్పీ పేర్కొన్నారు.

## బోయకొండలో పెరిగిన భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ



ఆలయంలోని క్యూలో ఉన్న భక్తులు

చౌడేపల్లె : కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందని బోయకొండ గంగమ్మ తల్లి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో బోయకొండ జనసంద్రంగా మారింది. ఒక్క రోజే సుమారు 15 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు అధికారులు వెల్లడించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనె దీపాలు, దీవెలతో మొక్కులు చెల్లించారు. ఈవో ఏకాంబరం ఆధ్వర్యంలో భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## క్లుప్తంగా

### ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

గంగవరం: రాష్ట్రంలో ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఫోరం ఫర్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి వేమేశ్వరి డిమాండ్ చేశారు. పలమనేరు పట్టణంలో ఆదివారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐసీడీఎస్ ప్రాజెక్టు ప్రారంభమై 48 ఏళ్లు గడుస్తున్నా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెట్టి చాకిరీ చేయించుకుంటున్నాయని విమర్శించారు. పనిభారంతో అంగన్‌వాడీలు మానసిక క్షోభకు గురవుతున్నారని ఆరోపించారు. కొంతమంది ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. అయినా తమపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనికరం కలగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అంగన్‌వాడీలకు ఇస్తున్న గౌరవ వేతనాన్ని రద్దు చేసి కనీస వేతనం ఇవ్వాలని కోరారు. అలాగే మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని, మెడికల్ సెలవులు, రిటైర్మెంట్ అయిన అంగన్‌వాడీల పేర్లను ఉద్యోగులుగా చూపించే యాప్ నుంచి వెంటనే తొలగించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీంలు అమలు చేయాలన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో 10 మండలాల వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు పాల్గొన్నారు.

### వ్యక్తి ఆత్మహత్య

కోట : తిరుపతి జిల్లా కోట మండలంలోని వెంకన్నపాళెంలో ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన ఎం.కోటయ్య(55) కుటుంబ కలహాల కారణంగా శివారు ప్రాంతంలోని మామిడితోటకు వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. స్థానికులు గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

చిత్తూరు ఎంఎస్ఆర్ కూడలి వద్ద మద్యం దుకాణం పక్కనే మినీ బారు




చిత్తూరు పాత బస్టాండు మద్యం దుకాణం పక్కన వరుసగా వెలసిన మినీ బార్లు




# వీధి వీధికో బార్

**నాణ్యమైన మద్యాన్ని అందుబాటులో ఉంచుతాం. అది కూడా రూ.వందలోపు ధర ఉన్న మద్యాన్ని మందుబాబులకు అందజేస్తాం... అంటూ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి నేతలు, అధికారంలోకి రాగానే దాన్ని అటకెక్కించేశారు. సూపర్ సిక్స్ పేరిట ఇప్పటికే ప్రజలకు కుచ్చుటోపీ పెట్టిన ప్రభుత్వం, అటు మందుబాబులకు ఇచ్చిన హామీ కూడా నెరవేర్చలేదు.**

- మద్యం దుకాణాల్లో కనిపించని రూ.99 బాటిళ్లు
- పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో 'కన్నడ' కిక్కు
- 20 శాతం లాభాల పేరిట మద్యం వ్యాపారులకు టోపీ
- లాభాల కోసం దుకాణాల వద్దే మినీబార్ల ఏర్పాటు
- కానరాని రూ.5 లక్షల జరిమానా

చిత్తూరు అర్బన్: చీప్ లిక్కర్‌ను అతి తక్కువ ధరలోకి తీసుకొస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం 50 రోజుల క్రితం ప్రైవేటు మద్యానికి జై కొడుతూ నూతన పాలసీని తీసుకొచ్చింది. మద్యం దుకాణాలు తెరుచుకున్న రెండు రోజుల తరువాత రూ.99కే కొత్త మద్యం పేరిట చీప్ లిక్కర్‌ను పరిచయం చేసింది. పేరుకు మాత్రం రూ.99 మద్యం అని చెప్పిన సర్కారు.. వీటి అమ్మకాలపై పరిమితి విధించింది. మందుబాబులకు మద్యం దుకాణం వరకు రప్పించడం, అక్కడ కావాల్సిన మద్యం లేకుండా చేసి.. తప్పనిసరిగా దాని కంటే అధిక ధరలు పలికే మద్యాన్ని కొనిపించే పన్నాగం చేసింది. ఇందులో కూటమి సర్కారు సఫలమయ్యిందనే చెప్పాలి. లేకుంటే జిల్లాలో 45 రోజుల్లో రూ.103 కోట్ల మద్యం విక్రయాలు జరగడం సాధ్యంకాదు. జిల్లా వ్యాప్తంగా 104 మద్యం దుకాణాలుంటే రోజుకు ఒక్కో దుకాణానికి సగటున 2 బాక్సుల రూ.99 మద్యాన్ని మాత్రమే సరఫరా చేస్తున్నారు. అంటే మామూలు మద్యం ఒక్కో దుకాణంలో 32 బాక్సులు అమ్ముడవుతుంటే, రూ.99 మద్యం మాత్రం రెండు బాక్సులకే పరిమితం చేస్తున్నారు. ఇందులోనూ కొన్ని దుకాణాల్లో రూ.99 మద్యాన్ని బెల్టు దుకాణాల నిర్వాహకులకు ఇచ్చేసి, స్టాకు అయిపోయిందని చేతులెత్తేస్తున్నారు. బెల్టు దుకాణాల్లో ఒక్కో బాటిల్‌కు రూ.10 అధికంగా వసూలుచేసి, రూ.99 మద్యం రూ.110కు ఇస్తున్నారు.

**అనధికార బార్లు 300**

మరోవైపు జిల్లాలో అధికారంగా పది మద్యం బార్లు ఉంటే.. అనధికారికంగా 300 వరకు బార్లు నడుస్తున్నాయి. మద్యం దుకాణం కోసం లైసెన్సు తీసుకున్న వ్యాపారులు, దుకాణానికి పక్కనే మినీబార్‌ను తలపించే పర్మిట్ గదులను ఏర్పాటు చేసుకున్నారు. దీనికి సమీపంలోనే వరసగా 3–4 దుకాణాలు మద్యం తాగడానికి వెలుస్తున్నాయి. పాలసీ ప్రకటనకు ముందు మద్యం వ్యాపారంలో 20 శాతం లాభాలు అని చెప్పిన సర్కారు నట్టేట ముంచేసిందని లైసెన్సుదారులు వాపోతున్నారు. అడిషనల్ రిటైల్ ఎక్సైజ్ టాక్స్ పేరిట డిస్టలరీ నుంచి డిపోకు అందుతున్న మద్యంపై 71 శాతం పన్నులు వేస్తున్నారని, అది కాకుండా నార్కోటిక్ డ్రగ్ కంట్రోల్ సెస్ కింద 2 శాతం, ఎడ్యుకేషన్ సెస్స్ కింద 0.2 శాతం తమ నుంచి వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక మద్యం స్టాకు పూతలపట్టులోని బండపల్లె నుంచి ఎక్కడో ఉన్న కుప్పం వరకు తీసుకెళ్లాలంటే రవాణా కోసం 1 శాతం వరకు ఖర్చు తప్పనిసరి. ఇది కాకుండా రోజుకు రూ.2 లక్షల చొప్పున లైసెన్సు రుసుము, దుకాణాల అద్దె, కరెంటు బిల్లు, పనిచేసే వాళ్లకు జీత భత్యాలు అన్నీ కలుపుకుంటే లాభం రాకపోగా, నష్టాలు వస్తున్నాయని చెబుతున్నారు. రోజుకు కనీసం రూ.2 లక్షల వ్యాపారం జరిగితే లాభం కాకుండా, నష్టం లేకుండా బయటపడొచ్చనేది వ్యాపారుల వాదన. కానీ జిల్లాలో కేవలం 20 శాతం దుకాణాల్లో మాత్రమే రోజుకు రూ.2 లక్షల వ్యాపారం జరుగుతోందని వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నష్టాలను అధిగమించడానికి దుకాణం పక్కనే పర్మిట్ గదులు పెట్టుకుంటే తప్పేంటని వాదిస్తున్నారు. పర్మిట్ గదులను తొలగించాలని, దీనివల్ల తమ వ్యాపారం పోతోందని బార్ నిర్వాహకులు ఇటీవల ఎక్సైజ్ ఉన్నతాధికారులను కలిసి విన్నవించుకున్నా.. ఆ మరుసటి రోజు దుకాణాలు మూసుకున్నాయే తప్ప, మళ్లీ యథావిధిగా అనధికారిక బార్లు తెరుచుకుంటున్నాయి.

### కర్ణాటక మద్యానికే కిక్కు

పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దు ప్రాంతాలు చాలా ఉన్నాయి. మన ప్రాంతాల్లో రూ.99 మద్యం దొరక్కపోవడంతో మందు బాబులు కర్ణాటక మద్యానికి అలవాటు పడుతున్నారు. అక్కడ క్వార్టర్ చీప్‌లిక్కర్ రూ.70 నుంచి లభిస్తుండడం ఇందుకు ప్రధాన కారణం. ఫలితంగా కుప్పం, పలమనేరు ప్రాంతాల్లో కర్ణాటక మద్యం విచ్చలవిడిగా లభిస్తోంది. ప్రభుత్వ ఖజానాకు భారీ గండిపడుతోంది.

### అధికారుల మౌనం..

రూ.99 మద్యం అందుబాటులో రాకపోవడానికి మద్యం డిస్టలరీలతో ప్రభుత్వం కుమ్మక్కై ఇతర బ్రాండ్లను ప్రమోట్ చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తోంది. ఇక అనధికారికంగా నడుస్తున్న మినీ బార్లను తొలగించడంలో అధికారులు మౌనం వహిస్తున్నారు. కళ్లెదుటే బెల్టు దుకాణాల్లో విచ్చలవిడి అమ్మకాలు జరుగుతున్నా నోరు మెదపడంలేదనే విమర్శలున్నాయి. నిబంధనలు అతిక్రమిస్తే రూ.5 లక్షల జరిమానా విధించాలన్న చట్టాన్ని జిల్లాలో ఒక్కచోట కూడా అమలు చేయలేదు. కొన్నిచోట్ల మద్యం దుకాణాల నిర్వాహకులు ఇచ్చే మామూళ్లకు అలవాటుపడి ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలున్నాయి. అందుకే లైసెన్సుదారులకు కొందరు అధికారులు కొమ్ముకాస్తూ, బార్ నిర్వాహకుల ఇబ్బందులు పట్టించుకోవడంలేదని తెలుస్తోంది. చిత్తూరు అర్బన్ స్టేషన్‌లో అడపాదడపా బెల్టు నిర్వాహకులపై కేసులు నమోదవుతున్నా.. మిగిలినచోట్ల బెల్టు ఎత్తేయడమనే ఊసే లేకపోవడం ఈ ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తోంది.

### హత్య కేసులో నిందితులకు రిమాండ్

శాంతిపురం: భర్త హత్య కేసులో నిందితులైన భార్య, ఆమె ప్రియుడు, మరో వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్టు రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 64 పెద్దూరు పంచాయతీ సోలిశెట్టిపల్లికి చెందిన మీనాకు రాళ్లబూదుగూరుకు చెందిన వి.ఆనంద్‌తో వివాహేతర సంబంధం ఉందన్నారు. ఈ క్రమంలో తమ సంబంధానికి భర్త గోవిందప్ప(38) అడ్డుగా ఉన్నాడని భావించినట్టు తెలిపారు. అతని అడ్డు తొలగించుకోవాలని ఈ నెల 4న గొర్రెలు మేపేందుకు వెళ్లిన గోవిందప్ప కళ్లలో కారం కొట్టి తలపై రాయితో మోది హత్య చేశారని తెలిపారు. అదే రోజు రాత్రి ఆనంద్ తన మిత్రుడు మతల్ అలియాస్ మునిరాజుతో కలిసి బైకుపై మృతదేహాన్ని బిసానత్తం వద్ద కర్ణాటక సరిహద్దులోని అటవీ ప్రాంతంలో పడేశారని తెలిపారు. ఈ నెల 5న తన భర్త కనిపించడం లేదని మీనా ఫిర్యాదు చేసిందన్నారు. దర్యాప్తులో అసలు విషయం తేలిందన్నారు. హత్యకు పాల్పడిన నిందితులను అరెస్టు చేసి మృతదేహాన్ని తరలించిన బైకును స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు ముగ్గురు నిందితులను ఆదివారం రిమాండుకు తరలించినట్టు వివరించారు.

### 'బాడీ బిల్డింగ్'లో స్వర్ణ పతకం



బాడీబిల్డర్ యోగేశ్వర్

శాంతిపురం: గోవాలో జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో మండలంలోని బడుగుమాకుల పల్లికి చెందిన వి.యోగేశ్వర్ ప్రతిభ చూపాడు. స్టార్ క్యాటగిరీలో స్వర్ణ పతకం, స్ట్రీట్ మోడల్ విభాగంలో అచీవ్‌మెంట్ మెడల్‌ను అందుకున్నాడు. శాంతిపురంలో చికెన్ సెంటర్ నడుపుకుంటున్న తండి వెంకటరమణాచారి ప్రోత్సాహంతో యోగేశ్వర్ బాడీ బిల్డింగ్ శిక్షణ తీసుకుంటున్నాడు. తొలి ప్రయత్నంలోనే పాల్గొన్న రెండు విభాగాల్లోనూ ఉత్తమ ప్రతిభ చూపి టోర్నీ నిర్వాహకుల నుంచి ప్రశంసలు అందుకున్నాడు.



### విద్యుత్ షాక్‌తో బెంగళూరులో రామకుప్పం యువకుడి మృతి



జావిద్(ఫైల్)

రామకుప్పం: మండలానికి చెందిన యువకుడు బెంగళూరులో విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. రామకుప్పానికి చెందిన జావిద్(26) బెంగళూరులో ద్విచక్ర వాహనాల మెకానిక్ షాపు నిర్వహిస్తున్నాడు. కష్టపడి ఆర్థికంగా నిలదొక్కుకుని 8 నెలల క్రితం రామకుప్పానికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. అనంతరం భార్యతో కలిసి బెంగళూరులోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం తన మెకానిక్ షాపులో ద్విచక్ర వాహనానికి మరమ్మతులు చేస్తున్నాడు. టైర్‌కు గాలి పట్టేందుకు కంప్రెసర్‌ను ఆన్ చేస్తుండగా షాక్ కొట్టింది. గమనించిన స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. జావిద్ మరణవార్తను బంధువులు, అతని మిత్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. రామకుప్పం శోకసంద్రంలో మునిగిపోయింది.

### మూడు కేజీల గంజాయి స్వాధీనం

– ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళెం: మండలంలోని బంగారుపాళెం–అరగొండ రోడ్డు కొత్తపల్లె బ్రిడ్జి వద్ద ఆదివారం మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ముందుగా అందిన సమాచారం మేరకు బంగారుపాళెం–అరగొండ రహదారి కొత్తపల్లె బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్టు తెలిపారు. ఈ క్రమంలో తవణంపల్లె మండలం కృష్ణాపురానికి చెందిన నాగయ్య కుమారుడు రాజశేఖర్(23), రవి కుమారుడు బాలాజీ(19)ని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.15 వేల విలువైన మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు పేర్కొన్నారు. ఏఎస్ఐలు రామచంద్రారెడ్డి, వల్లెమ్మ పాల్గొన్నారు.

### 105 లీటర్ల సారా స్వాధీనం



నిందుతుడి అరెస్టును చూపుతున్న అధికారులు

కార్వేటినగరం/పాలసముద్రం: పాలసముద్రం మండలంలో 105 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆయన ఆదివారం కార్వేటినగరం ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు డివిజన్ ప్రొహిబిషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి ఆదేశాల మేరకు ఆదివారం పాలసముద్రం మండలం అయ్యవారికండ్రిగ(నరసింహాపురం)లో దాడులు చేశామన్నారు. ఈ క్రమంలో చిన్నపయన్ కుమారుడు కంచి పాండురంగన్ ఇంటిలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 105 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పాండురంగన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఎస్ఐ పృథ్వీరాజ్, హెడ్‌కానిస్టేబుళ్లు మునిసుందరం, కృష్ణయ్య, రామచంద్రయ్య, సిబ్బంది విజయ్, ప్రతాప్, రాజ్‌దీప్ తదితరులు పాల్గొన్నారు.

### దుకాణం దగ్ధం



కాలిపోయిన దుకాణం

శాంతిపురం: మండలంలోని కేజీఎఫ్ రోడ్డులోని బోయనపల్లి క్రాస్ వద్ద జరిగిన అగ్నిప్రమాదంలో ఓ చిల్లర దుకాణం కాలిపోయింది. బోయనపల్లికి చెందిన మాదయ్య వారం రోజుల క్రితం ఈ దుకాణాన్ని ప్రారంభించాడు. ఆదివారం సాయంత్రం కరెంటు పోవడంతో దీపం వెలిగించాడు. అది గాలికి వాలిపోయి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లో అంతటా వ్యాపించాయి. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేదు. సమాచారం అందుకున్న కుప్పం అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పేశారు. కుటుంబ పోషణ కోసం అప్పులు చేసి దుకాణాన్ని ప్రారంభించామని, కళ్ల ముందే అంతా కాలిపోయిందని మాదయ్య కన్నీటిపర్యంతమయ్యాడు. ఈ ప్రమాదంలో రూ.2 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

## రూ.3 వేల కోసం ఫైనాన్స్ సంస్థ వేధింపులు

- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- హద్దుమీరితే చర్యలు తప్పవని సీఐ హెచ్చరిక





పుంగనూరులో బోర్డు కూడా లేని ఫైనాన్స్ సంస్థ కార్యాలయం, పుంగనూరు సీఐ శ్రీనివాసులు

పుంగనూరు : పుంగనూరులో ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు, వడ్డీ వ్యాపారుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. పట్టణంలోని షిరిడీ సాయినగర్‌లో బోర్డు కూడా పెట్టకుండా ఒక ఫైనాన్స్ సంస్థ వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తోంది. రూ.3 వేల కోసం ఒక కుటుంబాన్ని ఫైనాన్స్ సిబ్బంది వేధించారు. దీంతో బాధితులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన ఒక కుటుంబానికి చెందిన ఐదుగురు ఒక్కొక్కరు రూ.50 వేల చొప్పున ఒక ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో రుణం తీసుకున్నారు. వారు వడ్డీ కింద రూ.10 వేలు మినహాయించుకున్నారు. అలాగే ఇన్సూరెన్స్ కింద రూ.2 వేలు తీసుకున్నారు. అందుకు గాను సర్టిఫికెట్ కూడా ఇవ్వలేదు. మిగిలిన మొత్తం బాధితులకు ఇచ్చారు. ప్రతి నెలా రూ.2,850ల చొప్పున 24 నెలల్లో చెల్లించాలని నిబంధన పెట్టారు. ప్రతి నెలా చెల్లించే డబ్బుకు రశీదులు ఇవ్వలేదు. ఒక కంతు చెల్లించడంలో ఒక వ్యక్తి ఆలస్యం చేశారు. దీంతో ఫైనాన్స్ సిబ్బంది ఫోన్‌లో దుర్భాషలాడడంతోపాటు ఇంటికి మహిళలను పంపించి బెదిరించారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయంపై సీఐ శ్రీనివాసులు వివరణ ఇస్తూ కీర్తన ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు రూ.3 వేల కోసం ఇంట్లోకి వెళ్లి బెదిరించడం, అవమానించడం వాస్తవమన్నారు. రికవరీలకు మహిళలను పంపారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. నిబంధనల మేరకు లావాదేవీలు నిర్వహించాలని, ఎవరైనా హద్దుమీరితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే ఫైనాన్స్ సంస్థ మేనేజర్ అబ్దుల్లా వివరణ ఇస్తూ సకాలంలో కంతులు చెల్లించకపోవడంతో సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. ఇకమీదట అలా జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. ఆర్‌బీఐ అనుమతులతో వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### 11న ఐఐటీలో హ్యాకథాన్ ఫినాలే

రేణిగుంట(ఏర్పేడు): స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2024 ప్రతిష్టాత్మక గ్రాండ్ ఫినాలేను తిరుపతి ఐఐటీలో ఈనెల 11, 12వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడు తూ దేశంలో ఆవిష్కరణలు, సాంకేతిక పురోగతికి నేతృత్వం వహించేందుకు విద్యా మంత్రిత్వ శాఖ గుర్తించిన 51 నోడల్ కేంద్రాలలో తిరుపతి ఐఐటీ ఒకటి అని వెల్లడించారు. ఈ మేరకే ప్రాంగణంలోని ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గ్రాండ్ ఫినాలే పోటీలు చేపట్టనున్నట్లు వివరించారు. హ్యాకథాన్ 22 ఎలైట్ టీమ్‌లతో, దేశవ్యాప్తంగా ఉన్న ఆరుగురు ప్రతిభావంతులైన కళాశాల విద్యార్థులతో పోటీలు జరగనున్నాయన్నారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ గుర్తించిన నాలుగు క్లిష్టమైన సమస్య ప్రకటనలకు పరిష్కారాలను రూపొందించేందుకు కఠినమైన పోటీలో పాల్గొంటారని తెలిపారు. ప్రతి సమస్య ప్రకటన విజేతలను కేంద్రప్రభుత్వం నగదు బహుమతులతో సత్కరిస్తుందని వెల్లడించారు. దేశ పురోగతిపై అర్థవంతమైన ప్రభావం చూపే కొత్తతరం ఇంజినీర్లు, వ్యవస్థాపకులను పెంపొందించేందుకు ఈ పోటీలు దోహదపడతాయని వివరించారు.

### నాటు తుపాకీ మిస్ ఫైర్

– గిరిజనుడి మృతి

రాపూరు: నాటు తుపాకీ మిస్‌ఫైర్ అయి గిరిజనుడు మృతి చెందాడు. ఈ ఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, రాపూరు మండలం, పెనుబర్తి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం.. శనివారం రాత్రి పెనుబర్తి గ్రామానికి చెందిన తాళ్లసుధాకర్(27), శొంఠిమణి, శివకుమార్ కలసి గ్రామ సమీపంలోని అటవిలోకి అడవి పందుల వేటకు వెళ్లారు. అక్కడ ఏమిజరిగిందో ఏమోగానీ శొంఠిమణి చేతిలో ఉన్న తుపాకీ పేలి సుధాకర్ కణితకు తగిలింది.రక్త స్రావం కావడంతో అతన్ని ఇంటికి తీసుకొచ్చేశారు. ఈ విషయం ఆదివారం గ్రామస్తులకు తెలియడంతో 108 వాహనం ద్వారా రాపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సుధాకర్ మృతి చెందాడు. ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, సీఐ విజయ్‌కృష్ణ, కండలేరు, మర్రిపాడు ఎస్ఐలు రామకృష్ణ, శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మణి, శివకుమార్ పరారీలో ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, పూర్తి వివరాలు త్వరలో అందిస్తామని పోలీసులు తెలిపారు.

## భక్తరంజకంగా 'గీతా'లాపన



శ్లోకం ఆలపిస్తున్న విద్యార్థిని, పక్కన న్యాయ నిర్ణేతలు

తిరుపతి కల్చరల్ : అన్నమాచార్య కళామందిరంలో ఆదివారం నిర్వహించిన భగవద్గీత కంఠస్థం పోటీలు భక్తజనరంజకంగా సాగాయి. హిందూధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి వివిధ విద్యాసంస్థల నుంచి 139 మంది విద్యార్థులు హాజరై భగవద్గీత శ్లోకాలను ఆలపించారు. 6,7 తరగతుల విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా కె.స్వాతి, కె.భూమి, కె.హాహస్త, 8,9 తరగతులకు కె.నందిని, కె.నాగమల్లీశ్వరి, ఎం.వైష్ణవి, 18 ఏళ్లలోపు విద్యార్థుల విభాగంలో కేపీ ముకుంద, జి.జీవన్ శ్రీనివాస్, ఎం.నీరజ వర్ధన్, 18 ఏళ్ల పైబడిన వారిలో లో కేవీ లక్ష్మీదేవి, ఎంఎస్ జ్యోతి, పి.హేమ వెంకటనారాయణ తొలి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు. విజేతలకు ఈనెల 11వ తేదీన బహుమతులు ప్రదానం చేయనున్నారు.

## రెచ్చిపోతున్న 'ఎర్ర'దొంగలు!



పులివల్లం వద్ద టిప్పర్ లారీలకు ఎర్రమట్టిని లోడ్ చేస్తున్న యంత్రం



పులివల్లం ప్రాంతంలో గ్రావెల్‌ను తవ్వుతున్న యంత్రం

- పట్టపగలే గ్రావెల్ మట్టి తవ్వకాలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో ఎర్రమట్టి దోపిడీ కూటమి నేతలకు ధనార్జనగా మారింది. ప్రధానంగా వరదయ్యపాళెం, సత్యవేడు మండలాల్లో దర్జాగా పగటిపూటే ఎంచక్కా తవ్వకాలు జరుపుతూ టిప్పర్ల ద్వారా తమిళనాడుకు తరలిస్తున్నారు. నామినేటెడ్ పదవుల్లో ఉన్న కూటమి నేతల పేర్లు చెబుతూ తమకెవ్వరూ అడ్డు రాకూడదంటూ దర్జాగా దోపిడీ చేస్తున్నారు. ఇటీవల సత్యవేడు మండలం, రాజులకండ్రిగ వద్ద పెద్దఎత్తున అక్రమ తవ్వకాలు చేపట్టి వందలాది లారీలలో తమిళనాడుకు తరలించగా ఆరు లారీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు మొక్కుబడి కేసులతో మమ అనిపించారు. తాజాగా నాలుగు రోజుల నుంచి వరదయ్యపాళెం మండలం పులివల్లం నుంచి ప్రభుత్వ భూముల్లో భారీ ఇటాచీలతో టిప్పర్లలో నింపుకుని పట్టపగలే తమిళనాడుకు తరలిస్తున్నారు. అంతా కూటమి నేతల కనుసన్నల్లో జరుగుతోంది. రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

**తమిళనాడులో టిప్పర్ మట్టి రూ. 25వేలు**

ఆంధ్ర ఎర్ర మట్టికి తమిళనాడులో మంచి గిరాకీ ఉంది. ఆంధ్ర నుంచి తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్న ఒక టిప్పర్ లారీ మట్టి రూ.25వేలకు పైగా ధర పలుకుతోంది. దీంతో ప్రభుత్వ భూములు, చెరువులను అక్రమ రవాణాకు అడ్డాగా మార్చుకుని ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారు.